# ON DEATH (1861)

## మరణమును గురించినది మనుష్యులు ఒకమారే మరణము పొందుటకు నిర్ణయింపబడి యున్నది

ఈ మాట సత్యము, దీని గూర్చి అందరున్ను బాగా విచారించవలెను. చదివేవాడా నీ మేలున్ను నీ శుభమున్ను నేను మిక్కిలీ కోరుతూ వున్నాను. గనుక యిప్పుడు చెప్పబోయే సంగతులను గూర్చి బాగా శ్రద్ధ చేసుకొమ్ము. మనుష్యుల గతికిన్ని మృగముల గతికిన్ని చాలా భేదము కలదు. అవి ఈ బ్రతుకుతోనే కడతేరును. అయితే మనుష్యుడు శాశ్వతుడు. నిత్య సుఖము గల స్థితిలోకైనా నిత్య దుఃఖము గల స్థితిలోకైనా అతడు వెళ్లును.

### 1. అందరికిన్ని మరణము నిశ్చయము.

మరణము పాపమువల్ల వచ్చిన పాలు. దానిని యెవరైనా తప్పించుకోలేరు. భూమి మీద అంతటా మరణమునకు గురుతులు వున్నవి. మన మొదటి తల్లిదండ్రులైన ఆదామున్ను హవ్వయున్ను అనే వారి దినముల నాటి నుంచీ మరణమునకు లక్షణములు అంతటా కలిగియున్నవి. ఈ లోకము నశ్య పదార్థము అది అంతా నశించిపోతూ వున్నది. ఓ చదివేవాడా బాగా గ్రహించుము. గొప్పవారున్ను, తక్కువ వారున్ను, రాజులున్ను, భిక్షకులున్ను, చదువుకున్నవారున్ను, చదువుయెరగని వారున్ను, ముసలివారున్ను, పడుచువారున్ను, పసిబిడ్డలున్ను, ఘనముగల వారున్ను, ఘనము లేనివారున్ను, బలముగల వారున్ను, బలహీనులున్ను, ద్రవ్యముగల వారున్ను, ద్రవ్యములేని వారున్ను, అందరూ చావవలెను.

ఈలాగున వుండగా ఓ చదివేవాడా మరణమును నీవు తప్పించుకోగలవా? చావు నుంచి యెక్కడికి పరుగెత్తి దాగి యుండగలవు? అడవిలోకై నా సముద్రము మీదికైనా భూమ్యంత భాగములకైనా నీవు వెళ్లినప్పటికీ చావు తప్పించుకోగలవా? లేదు. అడుగడుగుకున్ను అది సిద్ధముగా వుండును. చావు కొంత కాలము పర్యంతమూ రాకుండా కొందరు చేయగలరు. గాని బొత్తిగా తప్పించలేరు. శ్రమను తగ్గించుకొనుటకున్ను అది వున్నప్పుడు ఓదార్పు పొందుటకున్ను చాలా సాధనములు ప్రజలు ప్రయోగించినప్పటికిన్ని కొంత కాలము వ్యవది గాని తుదకు యేలాగునైనా అది రాక మానదు. ఔషధబలము చేతనైనా దయగల బంధుమిత్రాదుల సహాయము చేతనైనా ఇంకా కొన్ని దినములకో కొన్ని సంవత్సరములకో చావును దూరపర్చినప్పటికీ అది మనలను కొట్టివేసి మరియొక స్థితిలోకి తీసుకొని పోతుంది. కాగా ఈ సంగతిని గూర్చి మనము నిశ్చింతగా వుండకూడదు. మనము యావత్కాలమూ ఈ లోకము కొరకే బ్రతికి లోకభాగ్యము యావత్తూ ఆదాయము చేసుకొని అంతమందు ఆత్మను పోగొట్టుకొన్నట్టయితే యేమి లాభము? ఈ జీవము కోసమే మనము ఆశపడరాదు. లోకమున్ను దీని వైభవమున్ను దీని యావత్సంపదలున్ను శీఘ్రముగా పోవును. ఇది మూడు దినముల బ్రతుకు. దీని నమ్ముకుంటే యేమి వున్నది? ఈ లోక భాగ్యము యావత్తు సంపాదించుకొనినా వెళ్లిపోయేటప్పుడు మొలతాడైనా మన వెంటరాదు. చనిపోయేటప్పు డు లోకము మన కోసము దుఃఖించదు. ఇటువంటి మాయలకు ఆశపడి వాటిని కౌగిట బట్టుకొంటే మనకు యేమి మేలు? ఓ స్నేహితులారా చూడండి. లోకపు మాయను గూర్చి ఒక కీర్తన చెప్పుతున్నాను గ్రహించండి.

# కీర్తన

మాయలో నీ మాయ సర్వము మాయలోకము మాయరా!!
కాయము సౌపాయము ఆదాయిమెల్లామాయరా!!

1. మంటిలో సర్వంబు బుట్టీ మంటగలిసే పోవురా!!
వొంటిగా వచ్చేటి యాత్మావొంటిగానే పోవురా! ॥మాయ॥

2. యెంత సంపద్భోగము కాసంతలోనే వీడురా!
సంతగొల్లూ దీరినట్లూ సర్వముడిగీ పోవురా ! ॥మాయ॥

3. పుట్టవచ్చూ నొక్కడూ మృతిబొంది పోవునొకడురా!
మెట్టుకీ ప్యాపారమబ్బే మృత్యువకు భూస్థలికి రా! ॥మాయ॥

4. రూపులూ జూచేటి కంటికి జూపు తృప్తి పోదురా!
మాపు రేపూ లేచి చోటా చూపు చూపే చూడరా! ॥మాయ॥

5. డెందమానందంబు నిండూ బొందదీ జగమందురా!
అందముగనూ క్రీస్తు పాదామందు భక్తీ నిల్పరా! ॥మాయ॥

6. ఆశలెల్లా గాలిమూటా లట్లుగాకేమబ్బురా!
యేసు నామామృతము గ్రోలూ మింతి యేసారంబురా!!॥మాయ॥

## 2. మరణము బహు భయంకరముగా వున్నది

అవును. చనిపోవుటకు అందరికిన్ని భయముగా వుంటుంది. వెళ్లిపోవుటకు సంతోషము యెవ్వరికిన్ని వుండదు. శరీరముతో కలిసివున్న యీ జీవుడు దాని వదిలి వెళ్లిపోవుట భయంకరమే. యెవరైనా దాని చూస్తే భయపడుదురు. ఇది ఆశ్చర్యముగాదు. బ్రతుకు మీద ఆశగలవారికి దీని నిజము తెలుసును. ఓ తలిదండ్రులారా, మీ పిల్లలు మీ కళ్ల

యెదుట చస్తూ వుండగా మీరు ఓర్చుకొనుటకు కష్టముగా వుంటుంది. ప్రియ బంధువులు మరిడీ సంకటము చేతనైనా మరియేరుగ్మత చేతనైన నిమిషములో పోవడము నీకు అసమ్మతముగా వుంటుంది. ఇందుకు ఆశ్చర్యము యేమిన్ని లేదు. అయితే ఇంతే కాదు సుమీ - మనుష్యుని యందు రెండు భాగములు గలవు. శరీరమున్ను, ఆత్మయున్ను. అతడు పాపము చేసినందున మరణముకు లోనైనాడు కాగా తన శరీరము నశ్యమయేది గనుక అది ఆవశ్యము చచ్చును. ఆ ఆజ్ఞ తప్పదు. శరీరము యెంత రూపముగా వున్నప్పటికిన్ని మంటిలోకే పోతుంది. అయితే చదివేవాడా ఆత్మ యేమవునో నీకు తెలుసునా? దాని నివాసము యెక్కడనో చెప్పగలవా? దానికి ఉత్తరజీవము లేదా? కొందరు లేదని తలచి అజాగ్రత్తగా వుంటారు. ఇహలోకమే తమ గతి యని తలచి బ్రతికినంత కాలము సుకుమారముగానే వుండి తమ పాపమును గూర్చిన్ని ఆత్మ రక్షణను గూర్చిన్ని నిశ్చింతగా వుంటారు. పశువులవలె బ్రతికి పశువుల వలె చస్తారు. ఇది మిక్కిలి దుఃఖకరము గానున్ను, భయంకరముగానున్ను, వున్నది. దేవుని ఆజ్ఞలు మీరి ఆయన ఘోరమైన శాపముకున్ను కోపముకున్ను లోబడిన వాడు చచ్చేటప్పుడు యేమైపోవునో చింతించవలెను. రాబోయే దైవోగ్రతను యేలాగు తప్పించుకో గలడో బాగా విచారించవలెను. ప్రభువు తన సత్య వాక్యమందు చెప్పిన మాటలు వినుము. పాపము చేసే ఆత్మ నాశనమవును. దుర్మార్గులున్ను దేవుని మరిచే జనులందరున్ను నరకములోకి తోసివేయబడుదురు. అక్కడ వారి పురుగు లయము కాదు వారిని దహించే అగ్ని ఆరిపోదు. పాపిష్ఠులారా మరి మీ గతి యేమిటి? మీ మనస్సాక్షి మీతో యేమి చెప్పుతూవున్నది? ఇటువంటి శిజక్షకు పాత్రులైనట్టు మీకు తోచుచున్నదా? దేవుడు పరిశుద్ధుడు. ఆయన న్యాయమును తప్పి నడిచినవాని నిరపరాధిగా యెంచడు. ఆయన నీతిగలవాడు గనుక ఆయన తన న్యాయమును జరిగించి విశ్వాసుల రక్షణచేత యెంత మహిమను పొందుతూ వున్నాడో అవిశ్వాసుల దండనచేత కూడా ఆయన అంత మహిమను పొందుతాడు. ఆలాగైతే ఈ

భయంకరమైన దుర్గతిలోనే నీవు చనిపోతే నీ మరణము యెంత ఘోరముగా వుంటుంది. నీ పాపములు యావత్తూ నీ నెత్తిమీద ఒక గొప్ప పర్వతము వలె వుండవా? నీ పాపములకు ప్రాయశ్చిత్తము చేసుకోగలవా? బొమ్మలను కొలిచి స్నానముచేసి దానము ఇచ్చి పుణ్యకర్మమును జరిగించి దేవుని దయను కొని మోక్షమును సంపాదించుకోగలవా? శక్యముగాదే. నీవు కూడబెట్టుకొన్న సొమ్ము దేవునికి కానుకగా పెట్టితే ఆయన అంగీకరించి ఇంత మాత్రము చేత శాంతినొంది నిన్ను నిరపరాధిగా యెంచి తన కుటుంబములోకి చేర్చుకొనునా? లేక నీ కడుపున పుట్టిన పిల్లలను ఆయనకు నీవు బలిగా అర్పించినా అందువల్ల వినియోగమేమైనా వున్నదా? ఇదంతా ఆయనను శాంతిపరచ గలదా? దీనివల్ల ఆయన సంతోషించునా? స్నేహితుడా! తలపోసి విచారించుము. నీవు యెంత చేస్తే నేమి, నీవు పాపాత్ముడవు , ద్రోహివి. దేవశత్రుడవు. న్యాయము యొక్క ఖండింపులో వున్నావు. నిన్ను నశింపచేయుమని ఆయన ఆజ్ఞ ఇప్పుడే బయిలు వెళ్లినదేమో! నిజముగా మరణముకున్ను నీకున్ను మధ్యను ఒక అడుగు మాత్రమే వున్నది. ఇప్పుడు నీవు చనిపోతే నీవు యెక్కడికి వెళ్ళుదువు. ఇప్పుడు నీవు చనిపోతే నీ మరణము మిక్కిలి భయంకరముగా వుండదా? తలపోసి విచారించుము. కటకటా! యేల యింత అజాగ్రత్తయేల? ఇంత నిశ్చింత, మరణమువంటి నిద్రలోనుంచి లెమ్ము.

## 3. మరణము తప్పించుకొని జీవమును పొందగలవా

అవును, చదివేవాడా, అవును బాగా గ్రహించుము – నీ శరీరము యేలాగునైనా పోతుంది – అది ఘటము వంటిది గనుక త్వరగా శిథిలమవుతుంది – దాని నీవు యెంత కాపాడుకొనినా కొంత కాలమునకు అది శ్మశానమందు వేయబడును – నీ ప్రియబంధువులనున్ను నీ నెళవరులైన వారినిన్ని నీవు విడిచి వెళ్లిపోవలయును – నీ ధనాశయున్ను, పుత్రాశయున్ను, దేనికోసము బహుగా కష్టపడితివో అదిన్ని నీవు వదులు కోవలెను. నిజమే – అయితే దీని గూర్చి దుఃఖమేల? నీ లోనవున్న

ఆత్మను గూర్చి తలంచుకొమ్ము - ఇప్పుడు దానికేమైనా సుఖము వున్నదా? - దాని గతియేలాంటిది? పైని చెప్పిన ప్రకారము చూస్తే అది మిక్కిలి దురవస్థలో వున్నట్టు కనబడుతుంది - యెందుకంటే అది పాపము యొక్క ఖండింపులోనున్ను శాపములోనున్ను వున్నది. అయితే ఒక దొడ్డ రక్షకుడు వున్నాడు సుమీ - ఆయన పేరు యెరుగుదువా? చెప్పుతాను వినుము. ఆయన పేరు యేసుక్రీస్తు. ఆయన దేవుని కుమారుడు. పాపాత్ముల నందరినిన్ని రక్షించుటకు దేవుడు ఆయనను పంపించెను. పాపము వల్ల అందరు నిత్యమరణము పొందుతున్నారని చూచి ఆ మరణమునుంచి వారిని తప్పించి నిత్యజీవమును వారికి దయచేసుటకు ఆయన వచ్చెను. ఆయన దయయే వారికి జీవము. ఆయనను యెవరు విశ్వసిస్తారో వారికి పాపపరిహారమున్ను నూతనమైన ఆత్మయున్ను పరిశుద్ధపు నడవడిన్ని మోక్షనిరీక్షణయున్ను దయచేస్తాడు. ఆయన యొద్దికి వచ్చిన వానిని ఆయన తోసివేయడు. ఆయనను నమ్మగానే జీవము దొరుకును. ఆయన పరిశుద్ధమైన ఆత్మ యెవరికి దొరుకునో వారికి నూతనమైన శక్తి కలుగును. వారికి పాపమందు ఆసక్తి వుండదు. వారు సకల పాపములను రోసి నిండు మనస్సుతో తండ్రి అయిన దేవుని తట్టు తిరిగి, ఆయన ఆజ్ఞలు గైకొని, ఆయన సేవ యందు ఆనందించి, వారి కాలములున్ను, కష్టములున్ను ఆయనకు అప్పగించి మరణదినమునకు ఆత్యాశతో యెదురు చూతురు. అవును చదివేవాడా! యేసుక్రీస్తు యందు జీవము కలదు. నమ్మినవారందరికొరకు ఆయన తన ప్రాణమును యిచ్చెను. వారి నిమిత్తము ఆయన శిలువను వేయబడి సమాధిలోకి వెళ్ళి తిరిగీ లేచెను. నమ్మినవారందరి కొరకు ఆయన మృత్యువుయొక్క బంధకములను తెంచి పరలోకమునకు యెక్కిపోయెను. జీవస్థులకు మోక్ష మార్గము ఆయన తెరిచెను. ఆయనను నమ్మిన వారికి మరణభయము వుండదు. వారి కష్టములన్ని వారు పొందవలసినప్పటికిన్ని రక్షకుడు ఆ కాలమందు వారికి శక్తిన్ని శాంతమున్ను సమాధానమున్ను దయచేసును. కాగా చావువల్ల

వారికి జీవమే గాని మరియొకటిగాదు. చదివేవాడా! నీ పాపమువల్ల నీవు మరణమునకే పాత్రుడవు, నరకమే నీ గతి. అయితే నీకు భయములేదు. ప్రభువును నమ్మితే ఆయన ఇచ్చిన బలివల్ల నీకు కలిగిన పాపము యావత్తు క్షమించబడును. తండ్రి ముఖమును నీవు ధైర్యముతో చూడవచ్చును. న్యాయము తీర్పు కాలమందు ప్రభువు సహాయమువల్ల నీవు ఆయన కుడిపార్శ్వ మందు నిలువబడి ఆయన సిద్ధపర్చిన ఆనంద స్థితిలోకి నీవు ప్రవేశించవచ్చును. కాగా మరణ స్థితిలోనుంచిలేచి జీవమును పొందుము. అయితే వో చదివేవాడా! నీవు యింకా అజాగ్రత్తగానున్ను నిశ్చింతగానున్ను వుండి నీ హృదయము మరింత కఠినపరుచుకొంటే ప్రభువు పిలుపులను నీవు అక్కర చేయక నీచుట్టూ వున్నవారి భయంకరమైన చావులవల్ల నీవు బుద్ధి తెచ్చుకోక నీ పశ్చాత్తాప దినమును నీవు దూరపర్చి జాలము చేస్తే నీ గతి మిక్కిలీ చెడ్డదిగా వుంటుంది. మరణము నీ యొద్దకి త్వరగా రాగలదు సుమీ. మరణమనే దూత నీ మీద బాణము వేసి తెలియని సమయమందున్ను కనుపెట్టని గడియయందున్ను నిన్ను కింద పడదోసి దిగంబరినిగానున్ను భయ విస్మయములతో నున్ను యెహూవా యెదుటికి నిన్ను కొంచుబోవును. కాగా దేవుని యెదుర్కొనుటకు సిద్ధపడుము.

ప్రభువు యీ మాటలతో నీకు ఆశీర్వాదము దయచేసును గాక.

ఆమెన్.